క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి జబ్బురోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

వేంకటేశ్వర స్వామికి శనివార పూజలు


విశేషాలంకారంలో వేంకటేశ్వరస్వామి

బంగారుపాళెం: మండలంలోని తిరవలి నెల మూడో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. శ్రీవేంకటేశ్వర స్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని నలగాంపల్లెలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

చిత్తూరులో కిడ్నాప్ కేసు నమోదు

చిత్తూరు అర్బన్: చిత్తూర్ నగరంలో వాజిద్ అనే యువకుడు కిడ్నాప్ ఘటనలో వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సత్యనారాయణపురానికి చెందిన శివ బార్బర్ షాపులు నిర్వహిస్తున్నాడు. ఇతను వద్ద పని చేసే ఉత్తరప్రదేశ్‌కు చెందిన వాజీద్ మరో దుకాణంలో పని చేయడాన్ని జీర్ణించుకోలేక పోయాడు. ఈక్రమంలో శుక్రవారం వాజీద్‌ను శివ కిడ్నాప్ చేసి రేణిగుంట సమీపం తీసుకెళ్లి చంపాలని ప్రయత్నించాడు. స్థానికులు గుర్తించడంతో చావబాది పారిపోయాడు. స్థానికులు వాజీద్‌ను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అనంతరం చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి బంధువులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న శివ కోసం గాలిస్తున్నట్లు వన్ టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జీవనజ్యోతి

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి అన్నారు. ఆ కళాశాలలో శనివారం నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్), శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో దేశ నిర్మాణంలో విద్య ప్రాముఖ్యత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న అశోక్ కిరణ్ మాట్లాడుతూ యువత లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. యువత తమ పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకుని ఉన్నత రంగాలకు చేరాలని చెప్పారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు మధుసూదనం మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడంతో బాధ్యతాయుతంగా మెలుగుతారని తెలిపారు. ఈ సదస్సులో ఆ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మీరాసాహెబ్, కో ఆర్డినేటర్లు భానుప్రకాష్, రామమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుశాఖలో బదిలీలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసు శాఖలో పని చేస్తున్న పలువురిని బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న కృష్ణమోహన్‌ను పలమనేరు రూరల్ సీఐగా, ఇక్కడ పనిచేస్తున్న అశోక్‌కుమార్‌ను చిత్తూరు వీఆర్‌కు బదిలీ చేశారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న ఏ హరి ప్రసాద్‌ను శ్రీసిటీ ఎస్ఐగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

గర్భసంచిలో 4 కిలోల కణితి

పుంగనూరు: ఓ మహిళ గర్భసంచిలో నాలుగు కిలోల కణితిని డాక్టర్లు శనివారం తొలగించారు. సోమల మండలానికి చెందిన 45 సంవత్సరాల మహిళ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ పట్టణంలోని మురళి హాస్పిటల్‌ను సంప్రదించారు. డాక్టర్ నిమిత పరీక్షలు చేసి, గర్భసంచిలో ఉన్న నాలుగు కిలోల గడ్డను తొలగించారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు.

లోయలో పడిన వ్యక్తి మృతి

సోమల: లోయలో పడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని పెద్ద ఉప్పరపల్లె సమీపంలోని దుర్గం కొండల్లో వెలసిన గార్గేయ మునీశ్వరస్వామి దర్శనానికి శుక్రవారం అయ్యప్ప మాల ధరించిన భక్తుల బృందం అక్కడికి చేరుకుంది. వారిలో పెద్ద పంజాణి మండలం వీరపల్లెకు చెందిన పురుషోత్తం(25) స్వామి వారిని దర్శించుకుని కొండపైకి వెళ్తుండగా జారి లోయలో పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని తోటి భక్తులు తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు.

రెవెన్యూ తీరుపై ఫిర్యాదుల పర్వం

- జగనన్నకు చెబుదాంలో వందలాది ఫిర్యాదులు
- అధికారులపై జాయింట్ కలెక్టర్ ఆగ్రహం
- జేసీ హెచ్చరికలు బేఖాతర్ చేస్తున్న వీఆర్వోలు


శుక్రవారం నాటి సమావేశంలో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు తరలివచ్చిన ప్రజలు

యాదమరి: మండలంలో రెవెన్యూ అధికారుల తీరుపై ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్నాయి. మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో తహసీల్దార్, వీఆర్వోలపైనా వందలాది మంది జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా రికార్డుల్లో ఉన్న భూములు ఆన్‌లైన్‌లో లేవంటూ బాధితులందరూ అర్జీలు అందించారు. తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిన జేసీ శ్రీనివాసులు 15 రోజుల్లో ప్రతి అర్జీని పరిష్కరించాలని లేకపోతే బాధ్యులను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. అయినా సిబ్బందిలో మాత్రం మార్పురాలేదు. ఆ మరుసటి రోజే ఆ అర్జీలను పట్టించుకునేది లేదని వీఆర్వోలు చెప్పడం గమనార్హం.

ఎవరికి వారే యమునా తీరే

తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో కింది స్థాయి అధికారులు ఎవరికి వారే యమున తీరే అన్న చందాన వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు, రైతులు సమస్యలతో సతమతమవుతున్నారు. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, సచివాలయ సిబ్బందిని పక్కదారి పట్టించారు. ఫలితంగా అర్జీదారులు వారాల తరబడి తిరగాల్సి వస్తోంది. వీఆర్‌ఓలను నిలదీస్తే, రైతులకు సరైన సమాధానాలు చేసే పరిస్థితుల్లో లేరు. దీంతో ప్రజలు, రైతులకు ఏమి చేయాలో అర్థంకాని సమయంలో మండల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వారి మనసులో ఉన్న విషయాలను నేరుగా అధికారుల వద్ద విన్నవించారు. రెవెన్యూ తీరు ఎంత అధ్వానంగా ఉందో జాయింట్ కలెక్టర్‌కు వివరించారు.

జేసీ ప్రశ్నించినా సమాధానం లేదు

మండలంలోని రెవెన్యూ, సచివాలయ సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదులు చేసి జేసీ ఆశ్చర్యపోయారు. మొత్తం కార్యక్రమానికి 211 మంది వస్తే, అందులో 196 మంది కేవలం రెవెన్యూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. మండలంలో రెవెన్యూ వ్యవస్థ ఇంత నిర్లక్ష్యంగా ఎందుకు ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వారి వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించాలని చెబుతుంటే, సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడమేంటని ప్రశ్నించారు. అధికారులెవరూ దీనిపై సమాధానమివ్వకపోవడం గమనార్హం.

తహసీల్దార్ – వీఆర్వో– తహసీల్దార్

ఏదైనా సమస్యపై తహసీల్దార్ వద్దకు వెళితే, వీఆర్‌ఓ వద్దకు వెళ్లాలని చెబుతారు. వీఆర్‌ఓ వద్దకు వెళితే తహసీల్దార్ పనులు చేయడం లేదని చెబుతారు. ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలం గడిపేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల మధ్య సమన్వయ లోపంతోనే భూ సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రజాప్రతినిధులు వచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక సచివాలయలో ఉన్న వీఆర్‌ఓలు, సర్వేయర్లు రైతుల గురించి పట్టించుకునే దిక్కు లేదు. కొందరు ఏకంగా లంచం డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. ఒక్కోసారి లంచం ఇచ్చినప్పటికీ మండల కార్యాలయంలో పెండింగులో ఉందంటూ పని చేయడం లేదని రైతులు చెబుతున్నారు. అధికారుల చేతివాటంతో భూ రీ సర్వే కూడా సక్రమంగా నిర్వహించలేదు. సరిహద్దు రాళ్లు సరిగ్గా నాటకపోవడంతో రైతులు మధ్య గొడవలకు దారి తీస్తున్నాయి. దీనిపై కూడా జేసీకి ఫిర్యాదులు చేశారు.

జేసీకి ఫిర్యాదు చేశాం

తహసీల్దార్ కార్యాలయంలో అధికారులెవరూ నా మాట వినడం లేదు. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. సంబంధం లేని వారికి అసైన్‌మెంట్ భూములు మంజూరు చేస్తూ వీఆర్‌ఓలు, సర్వేయర్లు ఫైళ్లు తీసుకొస్తున్నారు. వాటిని ససేమిరా అంటున్నాను. దీంతో అందరు నాపై కక్ష్య పెంచుకుంటున్నారు. రెవెన్యూ సిబ్బంది తక్కువగా ఉండడం మరో కారణం. ఇదే విషయాన్ని జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను. త్వరలో ఉన్నతాధికారులు పర్యటిస్తారు. అన్నీ సరిదిద్దుతారు.

– హనుమంతు నాయక్, తహసీల్దార్, యాదమరి

శ్రీవారికి విజయానందరెడ్డి పట్టువస్త్రాలు


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: పెరటాసి నెలను పురస్కరించుకుని చిత్తూరు నగరం బొండ్‌వీధిలో శనివారం గరుడసేవను నేత్రానందంగా నిర్వహించారు. వేకువజామున అభిషేకం, విశేష పూజలు జరిపించారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి గరుడ సేవపై ఆశీనులు చేశారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఊరేగింపుగా వచ్చి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముక్కంటిని కర్పూర హారతులతో దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయన్ను ఘనంగా సన్మానించి ప్రసాదం అందజేశారు. అనంతరం గరుడ వాహనంపై స్వామి వారు నగర వీధుల్లో విహరించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఏఎస్పీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఏఎస్పీ సుధాకర్ శనివారం తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, స్టేషన్ నిర్వహణ ఇతర రికార్డులను పరిశీలించారు. సీఐ విశ్వనాథరెడ్డికి పలు సూచనలు చేశారు.

భవిష్యత్ కోసం మళ్లీ జగనే సీఎం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: ఆంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. మొదట మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలకు ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలంటే కార్యక్రమంపై వీడియో చిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత చంద్రబాబు పాలన, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ఉన్న తేడా, ప్రజాభిప్రాయాలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి సీఎం జగన్ ఎందుకు కావాలో ప్రతి ఇంటికీ తెలియజేయాలన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, పార్టీ అధ్యక్షుడు జనార్దన్, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, రజినీకాంత్, రవీంద్రారెడ్డి, రెడ్డెప్ప, మోహన్, సుధాకర్‌నాయుడు, శంభు, సాయి,జయకోడి, గుణవతి, రాకేష్, వరదరాజులు రెడ్డి, మురళి, సామువేల్, డానియల్ పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

యాదమరి: మండల పరిధిలో సాగుతున్న అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆయన శనివారం యాదమరి పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులకు సమావేశం ఏర్పాటు చేశారు. మండలం తమిళనాడు సరిహద్దులో ఉన్నందున పేకాట స్థావరాలు, కర్ణాటక మద్యం విక్రయాలు, అక్రమ రవాణా వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. ఆయనతోపాటు చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి ఉన్నారు.

గోవిందరాజులగుట్ట భక్తులతో కిటకిట..!


అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు


పాదాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం టి.వేపనపల్లి గ్రామ సమీపంలోని గోవిందరాజుల గుట్ట శనివారం భక్తులతో కిటకిటలాడింది. గోవింద నామ స్మరణలతో మార్మోగింది. గుట్టలోని శ్రీవారి పాదానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామస్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి అభిషేకం చేశారు. శ్రీవారి భజనలతో భక్తులు భక్తిపరవశంలో మునిగిపోయారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కర్పూర హారతులతో శ్రీవారి పాదాన్ని దర్శించుకున్నారు. గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. గుట్టకు విద్యుత్ సౌకర్యం, రోడ్డు వసతి కల్పించేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ త్యాగరాజులు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల పరిరక్షణ అందరి బాధ్యత


నగర వనంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అటవీ అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: వన్యప్రాణుల పరిరక్షణ సమష్టి బాధ్యతని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కైరమ్మయి అన్నారు. వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. శనివారం చిత్తూరు నగరవనంలో విద్యార్థులకు అడవులు–వన్యప్రాణుల సంరక్షణ అనే అంశంపై పోటీలు నిర్వహించారు. తొలుత నిర్వహించిన ర్యాలీకి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఎఫ్ఆర్వో థామస్ బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో అందరూ మొక్కలు పెంచడం అలవాటు చేసుకోవాలన్నారు. అటవీప్రాంతంలో మొక్కలు నాటి వనభోజనం చేశారు.

వినాయకునికి సాంస్కృతిక నీరాజనం



నాటికలోని ఓ సన్నివేశం, పాటలను ఆలపిస్తున్న గాయకులు


నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు


నాట్యం చేస్తున్న కళాకారిణి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వార్షిక ప్రత్యేక ఉత్సవాల్లో స్వామివారి ఆస్థాన మండపంలో కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక నీరాజనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారుల నాట్య ప్రదర్శనలు, నృత్యాలు, ఆలపించిన భక్తి గీతాలు, నాటికలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులకు ఆలయ అధికారులు ప్రశంసా పత్రాలు, స్వామివారి ప్రసాదాలు అందించారు.

ఆరోగ్య సురక్షతో ప్రజలకు మెరుగైన వైద్యం


గుడిపాల: కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


చిత్తూరు: హెల్త్ క్యాంపులో పరీక్షలు చేయించుకుంటున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: జగనన్న ఆరోగ్యసురక్ష ద్వారా నగర ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారం జరుగుతోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు నగరంలోని పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్‌క్యాంపు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నగర ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఇంటి వద్దే రిజిస్ట్రేషన్ ఫారాలు ఇచ్చామని, క్యాంప్‌లో కూడా స్పాట్ రిజిస్ట్రేషన్‌తో వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. కార్పొరేటర్ జ్ఞానజగదీష్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ లోకేష్, నాయకులు నారాయణ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

చిత్తూరు రూరల్: ప్రజారోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు మండలం దిగువమాసాపల్లెలో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులకు వైద్యులు చికిత్స చేసి అవసరమైన వారికి మందులు, మాత్రలు అందజేశారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ త్యాగరాజులు, నాయకులు రాబర్ట్, దిలీప్ పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం జగనన్న ధ్యేయం

ఐరాల: సంపూర్ణుల ఆరోగ్యవంతుల్ని చేయాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పార్టీ మండల అధ్యక్షుడు బుజ్జిరెడ్డి అన్నారు. మండలంలోని నెల్లిమందపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 170 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ నాగరాజు, ఈఓపీఆర్డీ కుసుమకుమారి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

పేదలకు సంపూర్ణ ఆరోగ్యం

బంగారుపాళెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతోందని ఎంపీపీ అమరావతి అన్నారు. మండలంలోని కూర్మాయిపల్లెలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 351 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సేవలు అందించిన డాక్టర్లను కూర్మాయిపల్లె సర్పంచ్ హేమలత, చిల్లగుండ్లపల్లె సర్పంచ్ దీప, ఎంపిటీసీ హిందుశేఖర్‌రెడ్డి సన్మానించారు.

ఆరోగ్య సురక్షతో ఆరోగ్యాంధ్రప్రదేశ్

గుడిపాల: జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని మ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. బసవాపల్లె సచివాలయం ఆవరణలో శనివారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ఆయన పరిశీలించి అక్కడ అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 282 మందికి వైద్య చికిత్సలు నిర్వహించారు. అనంతరం కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష శిబిరాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హనుమంతు నాయక్ కోరారు. మండల పరిధిలో పత్రపల్లె పంచాయతీలోని సచివాలయంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష పథకాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్‌ను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. కంటిచూపు మందగించిన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు.

ప్రజలందరికీ ఆరోగ్యం సురక్షితం

తవణంపల్లె: ప్రజలందరికీ ఆరోగ్యం సురక్షితంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నలిశెట్టిపల్లె సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు భారతి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, సర్పంచ్ హంసవేణి ప్రారంభించారు. వైద్యాధికారులు ధాత్రేయచౌదరి, ప్రియాంక, మోహన్‌వేలు, వినయ్‌కుమార్, రోగులకు వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

పేదల ఆరోగ్య లక్ష్యమే ధ్యేయం

పూతలపట్టు: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా పేదలు ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. మండలంలోని తేనేపల్లి సచివాలయ పరిధిలో శనివారం సర్పంచ్ రాధా ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో 206 మంది సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. కంటిచూపు మందగించిన కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఆయుష్మాన్ భారత్ యోజన్ కార్డును అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, వైద్యాధికారులు జశ్వంత్, అరవింద్ పాల్గొన్నారు.





యాదమరి: స్టాల్స్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ హనుమంతు, తవణంపల్లె: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి, బంగారుపాళెం : కూర్మాయిపల్లెలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది, పూతలపట్టు: ఆయుష్మాన్ కార్డును అందజేస్తున్న తహసీల్దార్ విజయభాస్కర్